క్లుప్తంగా

అయ్యప్పకు పంచామృతాభిషేకం



అయ్యప్పకు హారతి ఇస్తున్న అర్చకుడు

పెందుర్తి: అయ్యప్ప జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని సుజాతనగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారికి పంచామృతాభిషేకాలు జరిపారు. ముందుగా గణపతి హోమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

నేడు పింఛన్ కానుక పంపిణీ

సబ్బవరం: వైఎస్సార్ పెన్షన్ కానుకలో భాగంగా పెంచిన పింఛన్లతో పాటు నూతనంగా మంజూరైన పింఛన్లను ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ గురువారం పంపిణీ చేస్తారని ఎంపీడీవో రమేష్ నాయుడు తెలిపారు.స్థానిక మూడు రోడ్ల కూడలి సమీపంలోని దుర్గాలమ్మ ఆలయం వద్ద ఉదయం 10 గంటలకు మండల స్థాయి కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. మండలంలో కొత్తగా 141 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీవో రమేష్‌నాయుడు తెలిపారు.

నేడు కాలభైరవ రుద్ర హోమం



శక్తి ఫౌండేషన్ కార్యదర్శి వివేకానంద

పెందుర్తి: కాల భైరవ జయంతి సందర్భంగా పెదగాడిలోని గోశాలలో గురువారం అష్ట భైరవ సహిత మహా కాలభైరవ రుద్ర హోమం నిర్వహించనున్నట్లు భైరవ శక్తి ఫౌండేషన్ ముఖ్య కార్యదర్శి వివేకానంద తెలిపారు. లోక కల్యాణార్థం తలపెట్టిన ఈ క్రతువు ప్రముఖ కాలభైరవ ఉపాసకులు విశ్వసాయి గురూజీ సంకల్పంతో తలపెట్టినట్లు వెల్లడించారు. శృంగేరి పీఠం పాలక్కడ్ శాఖ వేద పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ బొల్లాప్రగడ ధరహాసశర్మ వేద పండిత బృందం ఈ హోమాన్ని జరిపిస్తారని చెప్పారు. బృహత్తర కార్యక్రమంలో భక్తులంతా పాలుపంచుకోవాలని కోరారు.

50 మూగజీవాలకు టీకాలు



గొటివాడలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్న డాక్టర్ స్వర్ణలత

సబ్బవరం: మండలంలోని గొటివాడలో బుధవారం నిర్వహించిన పశు వైద్య శిబిరంలో గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఆరిపాక పశువైద్యురాలు డాక్టర్ ఎస్. స్వర్ణలత మాట్లాడుతూ మండలంలోని అన్ని పాడి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయడం జరుగుతుందన్నారు. 50 పాడి పశువులకు టీకాలు వేయడం జరిగిందన్నారు. ఈ నెల 31వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు తెలిపారు. గొటివాడ పశువైద్య సిబ్బంది కేవీ రమణారావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌టీఎస్ మధ్య రోడ్డులో వాకింగ్ వద్దు

పెందుర్తి: పెందుర్తి నుంచి గోపాలపట్నం వరకు ఉన్న బీఆర్‌టీఎస్ రహదారి మధ్య రోడ్డులో ప్రజలు వాకింగ్, రన్నింగ్ చేయవద్దని పెందుర్తి ట్రాఫిక్ విభాగం సబ్ ఇన్‌స్పెక్టర్ జి.రమేష్ కోరారు. ఇటీవల వాకర్స్ తరచూ మధ్య రోడ్డులో ప్రమాదాలకు గురవుతున్న కారణంగా ఉదయం, సాయంత్రం వాకింగ్/రన్నింగ్ మధ్యమార్గంలో కాకుండా బీఆర్‌టీఎస్ కుడి, ఎడమ వైపు చేయాలని సూచించారు.

ముత్యాల అలంకరణలో శ్రీనివాసుడు

ఎంవీపీకాలనీ: సెక్టార్-6లోని వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శ్రీ వేంకటేశ్వరస్వామి సతీసమేతంగా ముత్యాల కవచధారణలో భక్తులకు దర్శనమిచ్చారు. గోష్ఠిలో గోదాదేవి రచించిన తిరుప్పావైలోని 19వ పాశురాన్ని స్వామివారికి విన్నపం చేశారు. స్వామివారికి విశేష దీప హారతి ఇచ్చారు. పూజల అనంతరం సాయంత్రం 365 ఒత్తులతో హారతి వెలిగించి స్వామివారికి సమర్పించారు.

ప్రజా సంక్షేమానికి పెద్దపీట



పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



కార్యక్రమంలో పాల్గొన్న అవ్వాతాతలు

- అవ్వాతాతలకు సీఎం జగన్ భరోసా
- ఎమ్మెల్యే అదీప్‌రాజ్
- వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ

మండలంలో పింఛన్ దారులు **6,636** మంది
నూతనంగా మంజూరైన పింఛన్లు **83**

పరవాడ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. వెన్నలపాలెం కల్యాణ మండపంలో బుధవారం వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ చేపట్టారు. రూ.2,750 నుంచి రూ.3,000 వేలకు పెంచిన పింఛన్లను అవ్వాతాతలకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ నిరంతరం ప్రజల సంక్షేమం కోసం శ్రమిస్తున్న ప్రజా నాయకుడు జగనన్నకు ప్రతీ ఒక్కరు అండగా నిలవాలని కోరారు. రాజకీయాలు, కుల, మత, వర్గాలు, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతీ ఒక్కరికి పెన్షన్లు అందజేస్తున్నారని చెప్పారు.

నాడు అవ్వాతాతలకు కష్టాలు

గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ మంజూరు కావాలంటే పింఛన్ పొందుతున్న వారిలో ఎవరో ఒకరు మరణిస్తే తప్పా కొత్త వారికి పింఛను మంజూరయ్యేది కాదన్నారు. నేడు అటువంటి పరిస్థితులు లేవన్నారు. అర్హతను బట్టి అందరికీ పింఛన్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. మండలంలో 6,636 మందికి రూ.1.88 కోట్లు పింఛన్లు అందజేస్తున్నామన్నారు. దేశంలో మరెక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోనే అత్యధిక పింఛన్లు అందుతున్నాయని చెప్పారు. మండల పరిధిలో కొత్తగా 83 మందికి పింఛన్లు అందజేస్తున్నామని తెలిపారు.ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌ను రూ.3 వేలకు పెంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాట నిలబెట్టుకున్నారన్నారు. పేదల ఇంట్లో పెద్ద కొడుకులా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారన్నారు. పింఛనుదారులు ఆనందంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు చెప్పుకొంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, ఎంపీడీవో వి.హేమసుందర్రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు, పింఛన్‌దారులు పాల్గొన్నారు.

పెద్ద కొడుకులా..



ప్రభుత్వం పింఛన్‌గా రూ.3000 అందిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. నెల రోజులు ఎవరి మీద ఆధార పడకుండా ముఖ్యమంత్రి జగన్‌బాబు మంజూరు చేసిన పింఛన్ సొమ్ము సరిపోతుంది. పెద్ద కొడుకులా ఆదుకొంటున్న జగన్‌బాబు మాటే మాకు వేదవాక్కుగా భావిస్తాం. ఆ బాబు చల్లగా ఉండాలి.

– వెన్నల దేముడమ్మ, వెన్నలపాలెం

నా ఓటు జగన్‌బాబుకే



నాకు పింఛన్ మంజూరు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటా. నా భర్తకు రూ.2750 పింఛన్ వచ్చేది. అతను మరణాంతరం ఆ పింఛన్‌ను నాకు మంజూరు చేశారు. ఇద్దరు కొడుకులున్నా ఎవరి దారి వారు చూసుకుంటున్నారు. ఎవరి మీద ఆధార పడలేదు. ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ సొమ్ముతో జీవనం సాగిస్తున్నాను. నన్ను ఓ పెద్ద కొడుకులా ఆదుకొంటున్న జగన్‌కే వచ్చే ఎన్నికల్లో నా ఓటు.

– రొంగలి ముత్యాలమ్మ, తానాం

పింఛన్.. మురిసెన్

పరవాడ: ముత్యాలమ్మపాలెంలో వైఎస్సార్ పింఛన్ కానుకను గ్రామ సచివాలయ కన్వీనర్ బొంది అచ్చిబాబు పింఛనుదారులకు బుధవారం పంపిణీ చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ రూ.3 వేలకు పెంచారన్నారు. కార్యక్రమంలో సూరాడ స్వీడు మసేను, దూడ అప్పారావు, సూరాడ చినమసేను, అరిజిల్లి చంటి పాల్గొన్నారు.

- నాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెంలో వైఎస్సార్ పెన్షన్ కానుకను సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య పింఛనుదారులకు అందజేశారు. కార్యక్రమంలో కూండ్రపు దాదా నాయుడు, వలంటీరు కూండ్రపు లక్ష్మి పాల్గొన్నారు.



ముత్యాలమ్మపాలెంలో పింఛన్ అందిస్తున్న సచివాలయ కన్వీనర్ అచ్చిబాబు



నాయుడుపాలెంలో పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ వరలక్ష్మి సీతారామయ్య

సంక్షేమ సారథి సీఎం జగన్

భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



పాత అడవివరంలో కొత్త పింఛన్ అందజేస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం: దేశంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయని సంక్షేమ పథకాలు మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు అందిస్తున్నారని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. జీవీఎంసీ 98వవార్డు 530 సచివాలయం పరిధి పాత అడవివరంలో బుధవారం ముత్తంశెట్టి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన దగ్గర నుంచి ఇప్పటి వరకు అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఎవరెవరికి ఎంతెంత లబ్ధిచేకూరిందో కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పేదవాడి కళ్లలో ఆనందం చూడాలన్నదే జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. కుల మతాలు, వర్గాలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ఏమైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో కూడా ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురికి కొత్త పింఛన్లను ఆయన అందజేశారు.

త్వరలో భూ సమస్యకు పరిష్కారం

టీవీ టవర్‌కాలనీ వాసులు పలు సమస్యలను ముత్తంశెట్టి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ఆయన స్పందిస్తూ సింహాచలం దేవస్థానం భూసమస్య త్వరలోనే తీరుతుందన్నారు. సమస్య కోర్టులో ఉండటంతో ప్రభుత్వం అన్ని విధాలా పరిష్కార చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ –8జోన్ కమిషనర్ మల్లయ్యనాయుడు, వైఎస్సార్‌సీపీ 98వవార్డు అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, 98వవార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం, కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, పార్టీ నాయకులు నడింపల్లి రామరాజు, లంక సత్తిబాబు, ఎస్.అప్పారావు, ఎస్.కృష్ణ, లండ భాస్కర్, బోర లక్ష్మణరెడ్డి, లండ రమణ, మధురెడ్డి పాల్గొన్నారు.

బాధితుడికి రూ.50వేల సాయం అందజేత



బాధితుడి అప్పారావుకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, నాయకులు

పరవాడ: పెదముషిడివాడ గ్రామానికి చెందిన ఇసరపు అప్పారావుకు చెందిన మేకలకు వ్యాధి సోకడంతో నెల రోజుల్లో 40 మేక పిల్లలు, 10 తల్లి మేకలు మృతి చెందడంతో తీవ్రంగా నష్టపోయాడు. సదరు విషయాన్ని గ్రామ సర్పంచ్ పల్లా నాగమణి కుమారుడు పల్లా అప్పారావు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ స్పందించారు. మేకలకు సోకిన వ్యాధి నివారణకు తక్షణ చర్యలు తీసుకోవాలని పరవాడ పశువైద్యాధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. తన సొంత నిధుల నుంచి రూ.50 వేలు రైతు అప్పారావుకు బుధవారం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కబడ్డి అప్పారావు, నందవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి



మృదులను సత్కరిస్తున్న విదసం ఐక్య వేదిక ప్రతినిధులు, విద్యార్థులు

పెందుర్తి: సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతిని నాయుడుతోట సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విశాఖ దళిత సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి విదసం రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ బూసి వెంకటరావు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. సావిత్రిబాయి సమాజానికి చేసిన సేవలను ఆయన కొనియాడారు. గురుకులం ప్రిన్సిపాల్ మృదులను ఘనంగా సత్కరించారు. విదసం సలహాదారు ఎస్.ఆర్ వేమన, సహాయ కన్వీనర్ సోడదాసి సుధాకర్, ప్రతినిధులు బూల భాస్కరరావు, బల్ల కుమార్, ఎస్.నూకరాజు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వి.ఎస్ శ్రీలక్ష్మి, పీఈటీ మంగ, సాంఘిక గురుకుల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు కైలాష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

'విశాఖ ఉక్కును కాపాడుకుంటాం'



దీక్ష శిబిరంలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు నినాదంతో ఏర్పడిన ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. ఉద్యమాలతో సాధించుకున్న స్టీల్ ఫ్యాక్టరీని ప్రైవేట్‌పరం చేస్తామంటే చూస్తూ ఊరుకోబోమన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో 1056వ రోజు, బుధవారం సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ అమరవీరుల ప్రాణత్యాగంతో ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించడం దుర్మార్గమన్నారు. స్టీల్‌ప్లాంట్ గురించి ప్రజలందరూ నిలదీసే సమయం ఆసన్నమైందన్నారు. ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి భరోసా



వైద్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది

పరవాడ: వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి పేదల వైద్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పించారని వైఎస్సార్ సీపీ నాయకుడు అంజిరెడ్డి అన్నారు. దేశపాత్రునిపాలెం జీవీఎంసీ కల్యాణ మండపంలో దేవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రోగులకు దేవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్‌రాజా, చర్మ వ్యాధుల నిపుణుడు డాక్టర్ రమ్యకృష్ణ, ఎముకల వైద్య నిపుణుడు డాక్టర్ శ్రీనివాసరావు, నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ జైనాబ్, దంత వైద్య నిపుణురాలు డాక్టర్ దీపిక సేవలు అందించి ఉచితంగా మందులు అందజేశారు. దేవాడ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, నమ్మిదొడ్డి వైద్య సిబ్బంది, వలంటీర్లు, టీబీ సూపర్‌వైజర్ ఎస్.వి.రమణ, హెచ్.వి.శైలజ పాల్గొన్నారు.

త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముమ్మన

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డులో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. వార్డు పరిధిలోని చీమలాపల్లి రామాలయం వద్ద జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్డు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ముమ్మన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తున్నారన్నారు. ఏఎంసీ డైరెక్టర్ అయిత ఎర్రయ్య, నాయకులు కంచిబోయిన సంతోష్, దువ్వి అప్పారావు, బొట్ట రాము, గొడ్డి శ్రీను, విరోతు విశ్వనాథం, బొడ్డు దేముడుబాబు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణమండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకుడు కుమార్ తదితరులు విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో వెండి గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్ఠింపజేసి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

వైభవంగా ధనుర్మాస పూజలు



పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం తిరుప్పావై సేవా కాలం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి సన్నిధిలో విశేష పూజలు జరిపారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 7న వెంకటాద్రిపై సుదర్శన హోమం నిర్వహించనున్నారు.

ఆహార కమిషన్ సభ్యుడి విస్తృత పర్యటన



అధికారులకు సూచనలిస్తున్న రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు కాంతారావు

సబ్బవరం: రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు బి.కాంతారావు మండలంలో బుధవారం విస్తృతంగా పర్యటించారు. పలు పాఠశాలలు,రేషన్ డిపోలను తనిఖీ చేశారు. ముందుగా పెదనాయుడుపాలెం రేషన్ డిపోలో సరకులు,స్టాక్ వివరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. అదే గ్రామంలోని మరో డిపోను పరిశీలించి సమయపాలన పాటించాలని ఆదేశించారు. బియ్యం,పంచదార,కందిపప్పు లబ్ధిదారులకు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని డీలర్లతో పాటు అధికారులను ఆదేశించారు. ఎండీఎం వాహనాల వద్ద స్టాక్ పరిశీలించి అవకతవకలు,లోపాలు ఉంటే తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

మెనూలో రాజీ పడొద్దు

సబ్బవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద అమలు తీరుతెన్నులను పరిశీలించారు. మెనూ,నాణ్యత విషయంలో రాజీపడొద్దని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను కూడా సందర్శించారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థుల దైనందిన కార్యకలాపాలను పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. విద్యార్థులను తమ సొంత పిల్లల వలే భావించి వారి ఉన్నతికి బాటలు వేయాలన్నారు. కార్యక్రమంలో పౌర సరఫరాల అధికారి మూర్తి, ఏఎస్‌వో పీఆర్ కల్యాణి, సీఎస్ డీటీ లీలా శేషుకుమారి, ఎంఈవో మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు



ఆదిత్య కళాశాల ప్రోమోను ఆవిష్కరిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

పెందుర్తి: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని ఆంధ్ర యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎం. జేమ్స్ స్టీఫెన్ అన్నారు. గోపాలపట్నం ఆదిత్య డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం సుజాతనగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర స్థాయి ఫెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టీఫెన్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి పది మందికి ఉపాధి కల్పించేలా ఉండాలని ఆకాంక్షించారు. ఆదిత్య కళాశాల అధ్యాపకురాలు ఎస్.జయలక్ష్మి రూపొందించిన ప్రోమోను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ ఆఫ్ పాత్ర ఇండియా లక్ష్మి ముక్కవిల్లి, ఆదిత్య విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ నాయుడు, కళాశాల ప్రిన్సిపాల్ కె.మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.